# విలపించే సత్యం

"శివం"

తెల్లవారితే రేపను బియ్యం తేవాలి; జీతండబ్బులు అయిపోయినాయి. తను పడుకొని ఆలోచిస్తున్నాడు ఎట్లాగా అని. అవతల వాటాలోంచి హృదయం అవిసేట్లు ఏడుస్తున్నాడు రాముడు.

అవతలివాటాకి, యివతలి వాటాకు మధ్య చిల్లులు పడ్డ తడిక అడ్డము. తడిక అవతలనుంచి రాముడు గుక్కపట్టి ఏడుస్తూనేవున్నాడు. ఎవరూ అడగరేమిటి వాడిని ఎందుకని.

వంటింటిలోనుంచే వారి తల్లి అంటోంది "ఏమిటి బాబు, ఏమిటి? ఎందుకు?" అని. ఒక్కక్షణం ఆగి, దగ్గి మళ్లీ ఏడువసాగేడు సత్యం కొడుకు, రాముడు.

రేపు వుదయమే, లేవగానే వెంకట్రావు దగ్గిరకెళ్లి నాలుగు రూపాయలు అప్పు అడగాలి. ఇస్తే వాడే ఏమైనా యివ్వాలి. ఇంతో అంతో పైన సంపాదిస్తూండే వాడివ్వలేకపోతే యింకెవరిస్తారు తనకి.

"కడుపులో నొప్పేమోనే? డాక్టరుకు చూపించడేంరా అని రెండు నెలలనుంచీ మొత్తుకుంటూన్నా నామాట వింటేనా కాడు వాడు," రాముడి అమ్మమ్మ కాబోల్ను అంటోంది.

"ఏం నాన్నా... మంచి నీళ్లిచ్చేదా... పోన్లే...ఎక్కడ నొప్పి...చెప్పుబాబూ." సత్యంభార్య అంది చాలా శాంతంగా.

రాముడు ఏడుస్తూనే వున్నాడు! నానాలు గెళ్ళకుర్రాడు ఏం చెబుతాడు? వాడికి కడుపులో లివరు అనీ, డాక్టరుకి చూపించమనీ అంతా చెప్పేరు? అట్లాగే అంటాడు కాని సత్యం, ఎప్పుడూ డాక్టరుకి చూపించడు వాడిని. 'సరేలే' అంటాడు డబ్బులేవనడు సత్యం.

మరచిపోయేడు తను. వెంకట్రావు తనకి యింకా ఏం అప్పిస్తాడు? రేపటినుంచీ సెలవ పెట్టేడు-ఇవ్వేళ సాయంత్రమే వాళ్ళ అత్తారివూరుకు బండెక్కి వుంటాడు. ఛీ! అన్నీ యిప్పుడే వస్తాయి. మరెవరినన్నా అప్పిచ్చేవాడిని వెతకాలి ప్రొద్దున్నే. కాని ఎవర్ని?

"రామ, రామ! చెవులు పగిలిపోతున్నాయి!"

వాడిని కాస్సేపు చల్లగాలిలో అయినా త్రిప్పండ్రా......వూరుకుంటాడేమో?" రాముడి తాతగారు బయట కుక్కిమంచంలోంచి అంటున్నారు.

రాముడు వకక్షణం ఆగి తిరిగి అందుకున్నాడు. మానవుల బాధంతా తనదేనన్నట్లు హృదయ విదారకంగా వున్నదా రోదన, ఎంత బాధో? ఏమి బాధో!

"ఏమీ తెలియకపోతే తెలియనట్లు వూరుకోండి మీరు. గాలిలేక ఏడుస్తున్నాడుట! మరీ శోద్యం మీది. లోపల ఏం బాధో..." మధ్యగదిలోకి వచ్చి గట్టిగా అంది రాముడి అమ్మమ్మ.

"వాళ్ళ నాన్నగారొచ్చే వేళయ్యింది. ఆయన కాస్సేపు ఎత్తుకుంటే వాడే వూరుకుంటాడు." అని పెరట్లోకి వెళ్ళిపోయింది రాముడి తల్లి.

తాతగారు సకిలిస్తున్నారు. రాముడు ఏడుస్తూన్నాడు. తను ఆలోచిస్తున్నాడు. ఎవరిని అడిగేది ప్రొద్దున్నే అప్పు?

బూట్లు చప్పుడు చేసుకుంటూ సత్యం వచ్చేడు. ఎవరితోనో అంటూన్నాడు "క్రిందటిసారి తప్పకుండా వస్తావనుకున్నా మామయ్యా... ఈసారైనా తప్పించుకునే వాడివే నేను చూసి పట్టుకోనకపోతే."

"ఏం చేసేదిరా? ఎప్పటికప్పుడు అనుకోడమే. ఎవరూ ఏడుస్తూంట...మీ రాము ఏమిటి?"

"ఆ. వాడే. ఏం బాబూ... చూడు మామయ్య వచ్చేడు... అమ్మోయి మామయ్య వచ్చేడేవ్... నేను చూచి పట్టుకుంటేను...బిడవాళ్ళం మన యింటికి ఎందుకు వస్తారులే... కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళియ్యి..."

"కులాసాయేనా...ఫర్వాలే అలా కడుక్కోవచ్చు." అంటోంది సత్యం తల్లి.

"ఆ. కులాసాయే. బావ వంట్లో ఎట్లా వుంటోంది. యిక్కడ పెట్టనా యీ చెంబుని."

"ఆ. అలా వుంచండి. ఏదో యిట్లా వుంటున్నా.....మీ వూళ్ళో దోమలున్నాయా బావా!" అంటూనే దగ్గసాగేడు సత్యం తండ్రి.

మధ్యగదిలో సందడి తగ్గింది.

వంటింట్లో సందడి హెచ్చింది. రాముడికి బాధలో హెచ్చూ లేదు, తగ్గూ లేదు, అట్లాగే ఏడుస్తూన్నాడు వాడింకా.

తను ఆలోచిస్తున్నాడు అప్పు ఎక్కడ దొరుకుతుందా తెల్లారీ అని. ఇవ్వేళనే దొరకవలసింది అసలు. ఒక్క అరగంట ఆలస్యమయింది...దొరకవలసిన పెద్దమనిషి దొరికేసరికి. ఈలోగానే సత్యం వొచ్చి బ్రతిమాలడం, ఆ పెద్దమనిషి అతనికి ఆపది రూపాయలు అప్పుయిచ్చేయటం జరిగిపోయింది. ఈ సత్యం వకడు మధ్య సైంధవుడిలాగ. రేపు ప్రొద్దున్న ఎవరినో వకరిని వెతకాలి.

"ఏమిటో! ఎందుకొచ్చిన శ్రమ యిదంతాను. హాయిగా ఏ హోటల్లోనో తినేసే వాణ్ణి...యిట్లాలాక్కుని వచ్చేవు నన్ను." అంటూన్నాడు అవతల వాటాలోంచి బంధువు.

"మేమింకా యిక్కడ బ్రతికుండగానే హోటలు రాతేమిటి మామయ్యా! రేపు మేము మీ వూరొస్తే మీ యింటికి రావద్దనేగా?"

"ఆ. చాదస్తం."

"ఊరుకోరా బాబూ! ఊరుకో. రేపు పొద్దున్నే నాన్న చాక్లెట్లు కొని తెస్తారుగా. ఊరుకో." అంటూంది సత్యం తల్లి.

"రామ రామ. ఏమిటీ పాడుగోల." అంటూన్నాడు రాముడి తాతగారు.

రాముడు ఏడుస్తూనే వున్నాడు రాళ్ళు కరిగేటట్లు.

తనలాగే చాలీ చాలని జీతం సంపాదిస్తున్న సత్యాన్ని గూర్చి ఆలోచించిన కొద్దీ తనకి, మానవుడికి తోటిమానవుడి

(40-వ పేజీ చూడండి)

సువర్ణ మేహ వంగరాజీయం
బలహీనత, నడుమునొప్పులు, కీళ్ళనొప్పులు, కాళ్లమంటలు, మూర్ఛ, నోటిపూత, రక్తపిత్తము, అతిమూత్రము, మధుమేహము, ధాతునష్టము, జీర్ణించిన గనేరియా, స్త్రీలశ్వేత, రక్తప్రదరములు మొ॥ సమస్తమేహములకు రామబాణము. తులం రు 12/- వి. పి. అ 14.
ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

## నెహ్రూ మామయ్య

(32-వ పేజీ తరువాయి)

గొప్పగాడున్న దేమిటి?" అని నెహ్రూ ప్రశ్నించారు.

అంతా ఒక్కసారిగా జవహర్లాల్ నెహ్రూ" అన్నారు.

పిల్లలు నెహ్రూ మామయ్య కూతురు ఇందిరా గాంధీ సంతకం కోసం ఎగబడ్డారు. అందరి పుస్తకాలమీద సంతకాలు చేసేసరికి ఆవిడ చెయ్యి నెప్పిపెట్టింది. ఇది చూసి నెహ్రూ తెలివిగా తప్పుకున్నారు. ఆయన కార్యదర్శి ఒకడు "మీ పుస్తకాలు ఇక్కడ వదలి వెళ్లండి. ఆయనచేత సంతకాలు చేయించి పోస్టులో మీకు పంపించే పూచీనాది" అని హామీ ఇచ్చాడు.

బాల యాత్రికులు భారత అధ్యక్షుడు డాక్టరు రాజేంద్ర ప్రసాద్ గార్ని కూడా కలుసుకున్నారు. ★

---

## విలపించే సత్యం

(17-వ పేజీ తరువాయి)

యందు వుండే సానుభూతి కొంతో నశిస్తోంది. అతన్ని చూస్తున్నకొద్దీ తనలో అసహ్యం, యీర్ష్య యినుమడిస్తున్నాయి. ఒక్కసారీ అతను 'అయ్యో' అనుకుని బాధపడడేమిటి? ఆ చిరునవ్వేమిటి ఎప్పుడూ పెదాలపైన ఆ బంధుత్వ ప్రత్యయమేమిటి. చక్కటి సినిమాలలో వుద్యోగం తన్ని పారేసి తిరిగివచ్చిన యీ గుమాస్తాకు!

నెల మొదటినుంచీ ఎంతో జాగ్రత్తగా వుంటాడు తను. బంధువులకి వుత్తరాలు రాయడు తనసలు. కన్పిస్తే, వంటనే కష్టాలన్నీ గుమ్మరిస్తాడు వాళ్ళ చెవుల్లో. సినిమాలకు వెళ్ళడు డబ్బు చాలదని. ఉత్తమ గ్రంథాలు చదవలేడు, కొనుక్కోవాలసివస్తుందని. అయినా తన భార్యకు కట్టుకోడానికి చిరుసపట్టుని చీర లేదు. తనకి తొడుక్కోడానికి ఒక్క మంచి చొక్కా లేదు. అప్పు ఎక్కడ దొరుకుతుందా అని ఆలోచించని నెలలు లేవు.

ఆలోచించాలి. బాగా ఆలోచించాలి. ఉదయమే ఎవర్ని అప్పు అడగాలో! వాళ్ళు లేదనకుండేటట్లు తనముఖాన్ని మలిచంచేసుకోవాలి. వాళ్ళు నమ్మేట్లు తన అవస్థనువర్ణించాలి. అయినా లేదనడానికి అవతలవాళ్లకి చాలా తొందరుంటుంది. నిదానంగా ఆలోచించాలి!

"తాంబూలం వేసుకుసళ్ళు మామయ్యా! ఇంకా టైం వుంది."

"వొస్తాలేరా... తాంబూలానికేం."

"ఉత్తరాలు రాయిస్తాండుఅన్నయ్యా."

"అట్లాగేనమ్మా... రాముడూ... వస్తారా... ఏడవక తప్పకాదూ..."

"మీ సుబ్బారావును ఒక్కసారి పంపించు మామయ్యా... పండగ నాలుగు రోజులు యిక్కడ వుంటాడు సరదాగా." సత్యం అంటూన్నాడు.

"ఏమిటో అల్లరిమూక... ఎక్కడికి పంపిద్దామన్నా భయం...సరే అట్లాగేలే... నేను వుంటా..."

"అత్తయ్యను కూడా పంపించు... చాలా రోజులయ్యింది చూసి."

వెళ్లిపోయినాడు బంధువు సత్యం రాముడిని సముదాయిస్తున్నాడు. "ఏంటి నాన్నా బాధ... కడుపులోనా... ఎక్కడ... ఎల్లుండి డాక్టరుకు చూపిస్తాగా...వూరుకో యిక..."

"ఛ. ఛ. మాయగోల ప్రొద్దుటినుంచీ. గారాబం చేస్తూంటే మరీని." సత్యంభార్య అంటూంది.

"నీ కెందుకే నోరు మూసుకుని వూరుకోక. నాన్నా... వూరుకో... చాక్‌లెట్లు తెస్తాగా."

రాముడు ఏడుపును హెచ్చించేడు.

తాతగారు-"ఛ. ఛ. చెవులు పగిలిపోతున్నాయి" అని విసుక్కుంటున్నారు.

"ఊరుకో బాబూ! ఇక తగుల్తాయి." సత్యం అంటున్నాడు.

తను ఆలోచిస్తున్నాడు ఉదయాన్నే అప్పుకు బయలుదేరాలి. సుందర్రావు దగ్గర ఏమైనా వుండొచ్చు. ఎవ్వరూ లేవక మునుపే, ముఖ్యంగా - సత్యం లేవక మునుపే వెళ్ళి సుందర్రావునుపట్టుకోవాలి. అప్పు దొరకకపోతే ఏమౌతామో అనే ఆలోచన వచ్చేసరికి తన వళ్ళు జలదరించింది.

"నోరుమయ్యి. మూస్తావా లేదా?" అరుస్తూన్నాడు సత్యం.

రాముడు బెక్కి బెక్కి ఏడుస్తూనే వున్నాడు.

"వెధవా! నోర్ముయ్యమంటే." ఛళ్ళున దెబ్బ పడింది రాముడిపైన.

సామాన్య గుమాస్తాలాగ ఏడుస్తూన్నాడు రాముడు. స్వరంలో ఆకలీ, బాధ, నైరాశ్యం, నీరసం స్ఫురించేట్లు బిగ్గరగా ఏడుస్తూన్నాడు రాముడు.

"అట్లాగే ఏడ్చి ఏడ్చి చావు...నాకేం."

రేకులలోని కంతలోంచి చూచేడు తను అవతలి వాటాలోకి. రాముడు వో మూల వొదిగి ఏడుస్తూన్నాడు. సత్యం చాపపైన కళ్ళు మూసుకుని పడుండి వున్నాడు.

తను ఆలోచిస్తున్నాడు సత్యం ఆలోచన ఏమిటా అని.

"ఎప్పుడీ బాధలకి అంతం? ఎప్పుడు?" రాముడు గుండెలు పగిలేట్లుగ ఏడుస్తున్నాడు. రాముడి ఏడుపులో మనస్సును కలిపి నిశ్చయంగా, తన్మయత్వంతో విలపిస్తూన్న సత్యంముఖం తన కళ్ళముందు ఆడుతోంది.

తను ఆలోచిస్తున్నాడు మానవులంతా యిట్లాగే విలపిస్తున్నారా అని- ★


రు 1000 బహుమానం

లెప్రసీ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్ఠు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H. O. వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే మదరాసు.

గాంధినగర్, విజయవాడ.

కటక్, సికింద్రాబాదు,

రాజమండ్రి etc.

కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో. రాజమండ్రి